పట్టణంలో అంధకారం


చీకట్లోనే వాహనదారుల ప్రయాణం


వెలుగులు లేని ఆదిలాబాద్ పట్టణం

ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. సీసీఐ పరిధిలోని 133 కేవీ ఉపకేంద్రంలో జంపర్లు తెగిపోవడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఉపకేంద్రం నుంచి పట్టణంతో పాటు అయిదు మండలాలకు విద్యుత్తు సరఫరా అవుతుంది. జైనథ్, బేల మండలాలతో పాటు తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కరెంటు లేక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వసతిగృహాల్లో మోటార్లు నడవలేదు. తాగు నీరు, స్నానాలు తదితర వాటికి విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. తలమడుగు, జైనథ్ మండలాల్లో రాత్రి ఏడు గంటలకు, పట్టణంలో 8 గంటల తర్వాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

- ఈనాడు, ఆదిలాబాద్

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

కుళ్లిన చికెన్.. బూజు పట్టిన మిఠాయిలు

- ఆహార భద్రత అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి..


నాసిరకంగా ఉన్న లడ్డూలను పారబోయిస్తున్న అధికారులు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : ఆహార భద్రత అధికారుల ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, మిఠాయి దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించింది. బృందం ఇన్‌ఛార్జి వి.కిరణ్మయి ఆధ్వర్యంలో ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్లు పి.రోహిత్‌రెడ్డి, పి.స్వాతి, ఎస్.శ్రీశిఖ పట్టణంలోని హోటళ్లు, మిఠాయి దుకాణాలను తనిఖీ చేశారు. నాయుడు కుండ బిర్యాని హోటల్‌లో కుళ్లిన చికెన్‌ను గుర్తించి పారేయించారు. దిల్లీ మిఠాయి హౌజ్‌లో ఆరోగ్యానికి అత్యంత హాని చేసే రసాయనాలు, కుళ్లి బూజు పట్టిన తినుబండారాలను గుర్తించి వాటిని చెత్తబుట్టలో పారేయించి వాటిపై ఫినాయిల్ వేయించారు. వెంకటేశ్వర హోటల్, లోటస్ గ్రాండ్ హోటళ్లలోనూ తనిఖీలు నిర్వహించి తాఖీదులు ఇచ్చారు. వారం రోజుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. అన్ని చోట్ల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. నాసిరకంగా ఉన్నట్లు నివేదికలు వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆదిలాబాద్‌లోని మిఠాయి దుకాణాల్లో అత్యంత విషపూరిత రంగులు, రసాయనాలు కలుపుతున్నట్లు ఆమె పేర్కొంటూ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.


తినుబండారాలు పారబోయించి అందులో ఫినాయిల్ వేయిస్తున్న అధికారులు



ఇది ఉట్నూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బిగించిన సౌరశక్తితో నీళ్లను వేడిచేసే పరికరం(సోలార్ వాటర్ హీటర్). ఇక్కడ 600 మంది గిరిజన విద్యార్థినులు చదువుతున్నారు. సౌర విద్యుత్తు పరికరాలు ఏర్పాటు చేసిన కొన్ని రోజులే పని చేశాయి. ఆ తరువాత ఏమాత్రం నీరు వేడి కావడం లేదని విద్యార్థినులు వాపోయారు. చలికాలంలో చన్నీటితో స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందించాలి సారు.. అందించాలి వేడినీరు

- ఆశ్రమ పాఠశాలల్లో నిరుపయోగంగా యంత్రాలు

న్యూస్‌టుడే, ఉట్నూరు

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చలికాలంలో చన్నీటితో స్నానం చేసి అనారోగ్యం బారినపడకుండా వారికి వేడి నీళ్ల సౌకర్యం కల్పించేందుకు సౌరశక్తితో పని చేసే సౌర నీటి యంత్రాలను బిగించారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధీనంలోని ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు కలిపి మొత్తం 104 పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు చలికాలంలో చన్నీటితో స్నానం చేసి అస్వస్థతకు గురికావొద్దనే సదాశయంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ పథకం(ఐఏపీ) నిధులతో తెలంగాణ పునరుద్ధరణీయ వనరుల అభివృద్ధి(టీఎస్ఎన్ఆర్ఈడీసీ) ద్వారా సోలార్ హీటర్లను బిగించింది. అవి మూన్నాళ్లముచ్చటగా మారాయి.


వేడి నీరు రాక స్నానం చేయడానికి చేతిపంపు వద్ద నీళ్లను నింపుకొంటున్న గిరిజన విద్యార్థినులు(పాత చిత్రం)

ఒక్కోదానికి రూ.3 లక్షలు..

ఒక్కో పాఠశాలలో సౌర పలకలు, సింథటిక్ ట్యాంకు, ఇతర పరికరాలు కలిపి ఒక్కో సౌర వాటర్ హీటర్ ప్లాంటుకు రూ.3 లక్షల వ్యయంతో టీఎస్ఎన్ఆర్ఈడీసీ సంస్థ, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ సహకారంతో వీటిని బిగించారు. మొత్తం 104 పాఠశాలల్లో రూ.3.12 కోట్లు ఖర్చు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేమితో రూ.కోట్లు వెచ్చించి బిగించిన సౌర విద్యుత్తు పరికరాలు నిరుపయోగంగా మారాయి.

నిర్వహణ గాలికి..

సౌర వాటర్ హీటర్ల కోసం టీఎస్ఎన్ఆర్ఈడీసీకి రూ.3.12 కోట్లను ఐటీడీఏ మంజూరు చేసింది. ఆ సంస్థ పరికరాలను బిగించింది. నిర్వహణ మాత్రం విస్మరించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు ఆ సంస్థ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

☛ ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను వివరణ కోరగా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

తప్పిదాలు సరిచేయరా?

పాలనాప్రాంగణం: డీఎస్సీలో దొర్లిన తప్పిదాలతో నష్టపోయిన అభ్యర్థులకు ఇచ్చిన గడువు ముగిసిందని, ఇంకా ఎప్పుడు వాటిని సవరిస్తారని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి ప్రశ్నించారు. రెండు రోజుల్లో అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు.

మరమ్మతుల మతలబేంటి?


దెబ్బతిన్న తరోడ వంతెన

ఈటీవీ – ఆదిలాబాద్

ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులు దూర దృష్టితో చేపట్టాలనేది ప్రాథమిక సూత్రం. పదికాలాల పాటు ప్రజోపయోగానికి ఉపయోగపడాలి. జైనథ్ మండలం తరోడ వద్ద కుంగిపోయిన అంతరాష్ట్ర వంతెన పనుల నిర్వహణ దానికి భిన్నంగా సాగుతోంది. శాశ్వత పనులకు బదులు మరమ్మతుల పేరిట రూ.కోట్లు ఖర్చు చేయడంలో మతలబేంటో అనే అనుమానాలకు దారితీస్తోంది.

- అంతర్రాష్ట్ర రహదారిపై తరోడ వంతెన కథ

తెలంగాణ - మహారాష్ట్రను అనుసంధానం చేసే మార్గంలో తరోడ వద్ద ఉండే ఈ వంతెన 80వ దశకంలో నిర్మించారు. గతేడాది ఫిబ్రవరి 19న వంతెన మధ్యలోని ఓ స్లాబ్ కుంగింది. వాహన రాకపోకలను లాండసాంగ్వి - అర్లి మీదుగా మళ్లించారు. తర్వాత కుంగిన స్లాబ్‌ను తొలగించి కొత్త స్లాబ్ వేస్తే రాకపోకలు పునరుద్ధరించవచ్చని అభిప్రాయం వ్యక్తమైంది. అందుకు రూ.25 లక్షల వరకు ఖర్చవుతాయనే ప్రతిపాదనలు ఆచరణలోకి రాలేదు. దానికి బదులు అప్పట్లోనే వంతెన దిగువన వాగును ఆనుకొని తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.39 లక్షలతో చేపట్టే పనులకు ఎన్‌హెచ్ విభాగం టెండర్ నిర్వహించింది. పనుల నిర్వహణను దక్కించుకున్న నిర్మల్‌కు చెందిన ఓ గుత్తేదారు సంస్థ ఎర్రమట్టితో కూడిన మార్గం సహా ఏడు మీటర్ల వాగు వెడల్పునకు అనుగుణంగా కొన్ని పైపులతో మరమ్మతులు చేసింది. వరదకు తాత్కాలిక దారి పూర్తిగా కొట్టుకుపోయింది.

మళ్లీ రూ.4.50 కోట్లు

తాజాగా మళ్లీ వంతెనకు దిగువ భాగంలోనే మరమ్మతుల కోసం కేంద్ర ప్రభుత్వం మరో రూ.4.50 కోట్లు కేటాయించింది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన టెండర్లలో ఒక్క గుత్తేదారే బిడ్ దాఖలు చేయడంతో వాయిదాపడింది. రెండోసారి నిర్వహించగా రెండు బిడ్లు వచ్చాయి. టెండర్ ఓపెన్ చేయాల్సి ఉంది. రాజకీయ నాయకుల కనుసన్నల్లోని గుత్తేదారులే పనుల కోసం ఆసక్తి చూపడంతో అధికారులు నోరుమెదపలేని స్థితి నెలకొంటోంది. భోరజ్ నుంచి బేల మండలం మహారాష్ట్ర సరిహద్దు వరకు నిలిచిపోయిన జాతీయ రహదారి పనుల్లో తరోడ వంతెన కూడా ఉంది. ఆ పనులు జరిగేలా జిల్లా నేతలు కేంద్రంపై ఒత్తిడి తెస్తే ప్రస్తుతం రూ.4.50 కోట్లతో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరమే లేదు.

శాశ్వత పనులు చేయాలి



- రాందాస్, లక్ష్మింపూర్

రెండేళ్లుగా రాకపోకలకు ఇబ్బందవుతోంది. మా బాధలను నాయకులు పట్టించుకోవటం లేదు. మరమ్మతులు కాకుండా శాశ్వత రహదారిని నిర్మిస్తే బాగుంటుంది. ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపినట్లవుతుంది.

పట్టించుకోరేం: రామన్న, జైనథ్



ఇంతకుముందే చేసిన తాత్కాలిక పనులు వరదలకు కొట్టుకుపోయాయి. ఇప్పుడు చేసే తాత్కాలిక పనులు మళ్లీ వరద వచ్చి కొట్టుకుపోతే ఎలా? ఇలాంటి పనులు కాకుండా భవిష్యత్తుకు ఉపయోగపడేలా వంతెన నిర్మిస్తే బాగుంటుంది.

జాతీయ రహదారి ఏమైంది



- పెందూర్ మోహన్, జామ్ని

జాతీయ రహదారి పనుల్లో వంతెన నిర్మాణం కూడా ఉంది. రహదారి పనులను తర్వాతైనా చేసుకోవచ్చు. ముందు వంతెన పనులు చేసేలా నాయకులు కృషి చేయాలి. మరమ్మతులు చేస్తే లాభం లేదు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి.

రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పతకాలు


పతకాలతో చంద్రకాంత్, కాంతారావు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఈత కొలనులో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విద్యుత్తు వెలుగుల్లో నిర్వహించిన 9వ మాస్టర్స్ రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో జిల్లావాసులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 65-69 ఏళ్ల విభాగంలో మనుకంద కాంతారావు(న్యాయవాది) 400 మీ.ల ఫ్రీ-స్టైల్ విభాగంలో రజతం, 200 మీ, 50 మీ.ల బ్యాక్ స్ట్రోక్ విభాగాల్లో కాంస్య పతకాలు గెలిచారు. 30-35 ఏళ్ల విభాగంలో మార్చెటి చంద్రకాంత్ 50 మీ.ల ఫ్రీ-స్టైల్‌లో పసిడి, 200 మీ.ల బ్యాక్ స్ట్రోక్‌లో పసిడి, 50మీ.ల బ్యాక్ స్ట్రోక్‌లో రజత పతకం సాధించారు. వీరిని ఈత శిక్షకుడు కొమ్ము కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.


పల్లె పోరుకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేకపోయినా.. అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీని ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఓటరు జాబితాలను పూర్తి చేశారు. మరో వైపు బ్యాలెట్ పెట్టెలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో జిల్లాల వారీగా బ్యాలెట్ పెట్టెల అవసరం, మరమ్మతులు చేసేవి ఎన్ని అనే వివరాలను అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యూళ్లు జిల్లాకు చేరుకోగా, తాజాగా గ్రామ పంచాయతీ ఎన్నికల శిక్షణ మాడ్యూళ్లు జిల్లాకు సరఫరా చేయడంతో వాటిని డీపీఓ కార్యాలయంలో భద్రపరిచారు.

ఉమ్మడి జిల్లాలో 1,502 పంచాయతీలు ఉండగా 12,780 వార్డులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరిగే వీలుంది. వార్డుల సంఖ్య పెరగడంతో పాటు, ప్రతి వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరం ఉంది. ఈ లెక్కన గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను తిరిగి రెండు, మూడో విడత ఎన్నికల్లో ఉపయోగించుకోవచ్చు. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి చేరుకోవడంతో వాటిని గోదాంలో ఉంచారు.


డీపీఓ కార్యాలయానికి వచ్చిన ఎన్నికల సిబ్బంది మాడ్యూళ్లు



పంచాయతీలు	473
ఎంపీటీసీ స్థానాలు	158
జడ్పీటీసీలు	17
ఎంపీపీలు	17
వార్డులు	3,840
ఓటర్లు	4.41 లక్షలు
పురుష ఓటర్లు	2.16
మహిళలు	2.25

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు, వాటిలో సమస్యలు, కొత్తగా ప్రతిపాదించే కేంద్రాల్లో సమస్యలున్నాయనే దానిపై మండలాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలు పరిశీలించి ఇప్పటికే నివేదికను సమర్పించాయి. గతంలో కంటే కొత్తగా మరి కొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం కులగణనకు ఆదేశాలు జారీ చేయడం, దీనికి రెండు నెలలు గడువు ఇవ్వడంతో ఈ ఏడాదికి ఎన్నికలు లేనట్లేనని అధికారులు భావిస్తున్నారు. కులగణన పూర్తి చేసిన తర్వాత గత రిజర్వేషన్లను రద్దు చేసి, కొత్తగా రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు జరపాలనే డిమాండ్ ఉంది. రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.













త్యాగాల గురుతులు.. సేవల్లో ఘనులు!

● నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం

ఎక్కడ ఏ చిన్న గొడవ జరిగినా, శాంతిభద్రతలకు ఏ మాత్రం విఘాతం కలిగించే ఘటనలు జరిగినా ముందుగా మనకు గుర్తుకొచ్చేది పోలీసులే. సమాచారం ఇవ్వగానే వచ్చేస్తారు. సమాజ హితమే పరమావధిగా నిరంతరాయంగా విరామం లేకుండా 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. ఇలా విధుల నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులను, మావోయిస్టులను అరికట్టడంలో 1981 నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లాలో 50 మంది పోలీసులు అమరులయ్యారు. వారి త్యాగాలకు గుర్తుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో స్మారక నిర్మాణాలను నిర్మించి ఏటా అక్టోబరు 21న 'పోలీసు అమర వీరుల సంస్మరణ దినం' పాటిస్తూ నివాళులర్పిస్తున్నారు. వారం పాటు రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం

ఆలంపల్లి కాంప్లెక్స్



కడెం మండలం ఆలంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య 1987లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఎస్‌ఐలు, 11 మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారు. వీరి జ్ఞాపకార్థం పోలీసు హెడ్‌క్వార్టర్‌లో 'ఆలంపల్లి కాంప్లెక్స్' పేరుతో మూడంతస్తుల భవనం నిర్మించారు.

కోట్యానాయక్ ఉద్యానవనం



ఉట్నూర్ ఎస్‌ఐగా ఉన్న కోట్యానాయక్, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు 1991లో మావోయిస్టులు కొమ్ముగూడెం వెళ్లే దారిలో అమర్చిన మందుపాతరకు బలయ్యారు. ఇందుకు గుర్తుగా కోట్యానాయక్ స్మారకార్థం పిల్లల ఉద్యానవనం ఏర్పాటు చేశారు.

వ్యాయామశాల

బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాల సమాచారం చేరవేస్తున్నారని కానిస్టేబుళ్లు శేషు, సంజీవ్‌లను 2000 సంవత్సరంలో తుపాకులతో కాల్చగా వారిద్దరు మృతి చెందారు. ఈ ఇద్దరి పేరిట వ్యాయామశాలను నిర్మించారు.

చక్రపాణి సమావేశ మందిరం

మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ వద్ద 1993లో మావోయిస్టులు ఒక ఇంట్లో దాక్కోగా శ్రీరాంపూర్ సీఐగా పని చేస్తున్న చక్రపాణి వెళ్లగా సీఐతో పాటు కానిస్టేబుల్ అశోక్‌పై కాల్పులు జరిపారు. ఆయన పేరుతో 'చక్రపాణి మెమోరియల్ హాలు' నిర్మించారు.

స్మారక స్తూపం

వివిధ సందర్భాల్లో మావోయిస్టుల చేతుల్లో మృతి చెందిన పోలీసుల స్మారకార్థం అమరుల చిత్రాలను వేయించి ఏర్పాటు చేశారు. ఇక్కడే ఏటా అమరులకు నివాళులు అర్పిస్తుంటారు.



అమర వీరుల కాలనీ



విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు కుటుంబాలకు ఆదిలాబాద్‌లో ప్రత్యేక కాలనీని రూ. కోటి వ్యయం చేసి నిర్మించారు. 48 కుటుంబాలకు నివాసాలను నిర్మించారు. పోలీసు అమరవీరుల కాలనీగా నామకరణం చేసిన ఈ కాలనీ రాష్ట్రంలోనే మొదటిది.



గాదిగూడలో వైద్య శిబిరంలో ఔషధాలను అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్‌ఆలం

ఉమ్మడి జిల్లాలో 50 మంది

ఉమ్మడి జిల్లాలో మొత్తం 50 మంది పోలీసులు సంఘ విద్రోహుల చేతిలో అమరులయ్యారు. వీరిలో 48 మందిని మావోయిస్టులు హతమార్చారు. మరో ఇద్దరిని సంఘ విద్రోహ శక్తులు హత్య చేశాయి. వీరిలో ఒక సీఐ, ఏడుగురు ఎస్‌ఐలు, ఒక ఏఎస్‌ఐ, 12 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 29 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

సామాజిక కార్యక్రమాలు ఇవే..

- తిర్యాణి మండలంలో ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి రోంపల్లి-గుండాల, భీంపూర్-మంగి, కడెం మండలం నవాబ్‌పేట-గంగాపూర్ వరకు మట్టి రహదారులు నిర్మించారు.
- సిరికొండ మండలంలో పాలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టారు.
- బజార్‌హత్నూర్ మండలం డెడ్రలో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేయించి విద్యార్థులకు పోర్ట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించారు.
- గుడిహత్నూర్‌లో ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.
- గాదిగూడ, నార్నూర్ మండలాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించారు
- ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో ఆదివాసీలకు 1000 దుప్పట్లు పంపిణీ చేశారు.
- ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో ఆదివాసీ యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించారు.
- ఏటా వర్షాకాలంలో వాగుల వద్ద వరద ఉద్ధృతి కారణంగా ప్రాణనష్టం జరగకుండా పోలీసు బలగాలను మోహరిస్తున్నారు.
- ఇటీవల విపత్తు నిర్వహణ జిల్లా బృందాలను రెండింటిని అందుబాటులోకి తెచ్చారు. వీరి వద్ద ప్రమాద సమయంలో ప్రజలను కాపాడటానికి అవసరమైన అన్ని పరికరాలు, బోట్లు ఉంచారు
- రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు సరకులు పంపిణీ చేస్తున్నారు.

రైలు ఢీకొని 180 జీవాల మృత్యువాత

సిర్పూర్(టి), కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం ఆరెగూడ సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొని 180 జీవాలు మృత్యువాతపడ్డాయి. ఇందులో 170 గొర్రెలు, 10 మేకలు ఉన్నాయి. కౌటాల మండలం సిర్సా గ్రామానికి చెందిన జె.భీమయ్యకు 190 జీవాలు ఉన్నాయి. వాటిని మేపేందుకు నిత్యం ఇతర ప్రాంతాలకు సంచరిస్తుంటాడు. ప్రస్తుతం ఆరెగూడ సమీప కాగజ్‌నగర్-బల్లార్షా రైల్వే లైన్ వద్ద తాత్కాలికంగా స్థావరం ఏర్పాటుచేసుకున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది. జీవాల మంద వద్ద కాపలా ఉన్న అతను తలదాచుకునేందుకు సమీపంలోని పాకలోకి వెళ్లి నిద్రపోయాడు. వర్షం ఎక్కువ కావడంతో ఆ జీవాలు చెట్ల కిందకు చేరుకునేందుకు పట్టాలు దాటుతున్న క్రమంలో ఒక్కసారిగా రైలు రావడంతో కిందపడి మృతిచెందాయి. తెల్లవారు జామున మంద కనిపించకపోవడంతో బాధితుడు గాలించగా.. సమీప రైలు పట్టాల వద్ద విగత జీవులుగా కనిపించాయి. 10 మేకలు మాత్రమే బతికాయని, తన జీవనాధారం పోయిందని కన్నీటిపర్యంతమయ్యాడు. దాదాపు రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.



పట్టాలకు ఒకవైపు చెల్లాచెదురైన జీవాల కళేబరాలు

శ్వాస అందించి.. ప్రాణాన్ని రక్షించి!

ఇచ్చోడ, న్యూస్‌టుడే : 108 సిబ్బంది సమయానికి చేరుకొని పసిబిడ్డ ప్రాణాన్ని రక్షించిన ఘటన ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం కోలాంగూడకు చెందిన గర్భిణి షబానాకు శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. 108ను సంప్రదించడంతో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నొప్పులు తీవ్ర కావడంతో ప్రసవం చేశారు. శిశువు ఏడవకపోవడం, శ్వాస తీసుకోకపోవడంతో ఈఎంటీ రాకేష్ కృత్రిమ శ్వాస అందించి ప్రాణం పోశారు. పైలెట్ అలీం తోడ్పాటుతో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉందని, తండ్రి షేక్ లదీమ్ తెలిపారు.



శిశువు

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు

● అమ్మవారిని ఆదివారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శిక్షణ కళాశాల ఎస్పీ బ్రజేశ్‌మిశ్రా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నగదుతో సరిహద్దు దాటుతున్నారా.. జాగ్రత్త!

● మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 15న షెడ్యూల్ విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో ఎన్నికల నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలను ప్రారంభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున అవతలి వైపు మహారాష్ట్ర పోలీసులు ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తెలంగాణకు సరిహద్దున ఉన్న మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని అనేక పట్టణాలకు, పల్లెల మధ్య నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలపై అవసర నిమిత్తం వెళ్లి వస్తుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, నాందేడ్, యావత్మాల్, గడ్చిరోలి జిల్లాలు తెలంగాణ రాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అవసరం నిమిత్తం నగదు తీసుకెళ్లేవారు ఎంతో జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో చిన్న పొరపాటు చేసినా ఇబ్బందులు తప్పవు..



మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దున కోటపల్లి మండలంలోని రాపన్‌పల్లి(ప్రాణహిత వంతెన) వద్ద తనిఖీలు చేస్తున్న కోటపల్లి పోలీసులు

రూ.50 వేలకు మించితే ఆధారాలు తప్పనిసరి..

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎవరైనా వెంట నగదు తీసుకెళ్లేటపుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించిన ఆధారాలు వెంట ఉంచుకోవాలి. రసీదులను తనిఖీ చేసే అధికారులకు చూపాలి. లేనిపక్షంలో సీజ్ చేస్తారు. అదేవిధంగా నగదుతో పాటు బంగారం, వెండి కొనుగోలు చేసినా.. రసీదు తప్పనిసరిగా వెంట పెట్టుకోవాలి. వస్తువుల కొనుగోలు, అమ్మకాలతో పాటు బిల్లుల చెల్లింపులు చేసినా రసీదు తప్పనిసరిగా కలిగిఉండాలి. నగదు వెంట తీసుకెళ్లేటపుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఆధారాలను వెంట పెట్టుకోవాలని ఎన్నికల అధికారులు ప్రకటనల ద్వారా సూచిస్తున్నారు. తనిఖీలో నగదు దొరికితే.. ఆధారాలు చూపించిన తిరిగి పొందాల్సి ఉంటుంది. మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల ప్రజలు వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాలను సరిహద్దున ఉన్న తెలంగాణలోని వివిధ పట్టణాలకు వస్తుంటారు. జిల్లా వాసులు మహారాష్ట్రకు వెళుతుంటారు.

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పట్టణాలు, ప్రాంతాలు..

- నిర్మల్ జిల్లాలోని ముథోల్, బాసర, కుంటాల, సారంగాపూర్, కుభీర్ మండలాలు మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నాయి.
- మహారాష్ట్ర.. నాందేడ్ జిల్లాలోని ధర్మాబాద్ మహోర్ ఉమ్రి, కిన్వాట్, ముత్తేడ్, లోహా.
- కుమురంభీం జిల్లాలోని బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), వాంకిడి, కెరమెరి, జైనూర్
- మహారాష్ట్ర చంద్రపూర్, గడ్చిరల్లి జిల్లాల్లోని జమితి, రాజురా, లక్కుర్‌కోడ్, కోడ్నా, అహేరి
- మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి, చెన్నూరు, వేమనపల్లి మండలాలు మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్నాయి.
- మహారాష్ట్ర.. గడ్చిరోలి జిల్లాలోని సిరోంచ, అంకిసా, ఆసరల్లి, మొట్లగూడెం, తదితర ప్రాంతాలు తెలంగాణకు ఆనుకొని ఉన్నాయి.
- ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తాంసి, తలమడుగు...
- మహారాష్ట్రలోని యవత్మాల్ నాందేడ్, చంద్రపూర్ జిల్లాల్లోని మాండివ్వీ, బోరి, పిప్పల్‌కుట్టి, పాండ్రకవడ ప్రాంతాలు..

దేవత పూజలకు గానుగ నూనె సిద్ధం



గానుగలో నువ్వుల నూనెను తీసేందుకు కర్రను తిప్పుతున్న యువకులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఆదివాసీ గిరిజనులు మరో వారం రోజుల్లో దండారీ ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఉపవాస దీక్షతో ఆదివారం ఇంద్రవెల్లి మండలం పొల్లుగూడలో మహాలక్ష్మీ దేవత పూజల కోసం గూడెంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గానుగ ద్వారా నువ్వుల నూనెను తీస్తున్నారు. ఆదివాసీ గోండు, కొలాం గిరిజనుల దేవతలకు పూజల సందర్భంగా ప్రత్యేకంగా గానుగలో తీసిన నువ్వుల నూనెతోనే దీపం వెలిగించి దేవతలకు మొక్కుతామని, దీపావళి పండగ సందర్భంగా ఇంటి ముందర ఏర్పాటు చేసే దీపాలను సైతం నువ్వుల నూనెతోనే వెలిగిస్తామని ఆదివాసీ మహిళలు మెస్రం లక్ష్మీ, సీడాం జంగుబాయి తదితరులు తెలిపారు.

సరదా ఆట.. ఆరోగ్యబాట

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : ఆదివారం వచ్చిందంటే చాలు చిన్నారులకు పట్టరాని సంతోషం. పుస్తకాలను పక్కన పెట్టి వారికి నచ్చిన ఆటలు ఆడుతూ ఆనంద పడుతుంటారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని క్యాతనపల్లి పుర పరిధిలోని జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గతంలో అయిదు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ రావడంతో ప్రతి చోట ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. పలు వార్డుల్లో నిర్మాణ పనులు కొనసాగుతుండగానే చిన్నారులు ఓపెన్ జిమ్‌లో ఇలా ఆనందంగా గడుపుతున్నారు. చిన్నారుల ఆటమైదానం పనులు కూడా త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



ఆర్కేపీ తారకరామ కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లో ఆడుతున్న చిన్నారులు

23న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 కబడ్డీ పోటీలు ఈ నెల 23న బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల(కాసిపేట)లో నిర్వహించనున్నట్లు డీఐఈఓ అంజయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.బాబురావు తెలిపారు. బాలురకు కాసిపేట పాఠశాలలో, బాలికలకు సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలకు ఇంటర్ చదువుతున్న 19 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు బోనాఫైడ్, ఆధార్ కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు 18 మంది పశువైద్యాధికారులు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో పశుసంవర్ధక శాఖ పరిధిలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న పశు వైద్యాధికారుల పోస్టులు భర్తీ అయ్యాయి. ఇటీవల ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు జిల్లాకు 18 మందిని కేటాయించింది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో వారు విధుల్లో చేరారు. కొత్తగా పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	పశువైద్యశాల
లావణ్య	తలమడుగు
విజయ్‌కుమార్	ముత్నూర్
శ్రీకాంత్	గుడిహత్నూర్
వంశీకిరణ్	శాంతాపూర్
దీపరతన్	ల్యాబ్, ఆదిలాబాద్
మహమ్మద్ అబ్దుల్	పొన్కల్
సంపత్	నెన్నెల
పరిమళ	కాగజ్‌నగర్
రమేశ్	దహెగాం
సౌందర్య	కడెం
ప్రియాంక	కుంటాల
సంధ్యారాణి	రేవాజీపేట
శరణ్య	ఇందాని
అంజలి	ముత్యంపేట
సురేశ్	కెరమెరి
కార్తీక్	రెబ్బెన
భవిత	సిర్పూరు(టి)
రత్న సుప్రియ	వేమనపల్లి

అండగా ఉంటూ.. ఆర్థికంగా చేయూతనిస్తూ..

● బాధిత కుటుంబాలకు స్నేహితుల భరోసా

లోకేశ్వరం, న్యూస్‌టుడే: పదోతరగతి పూర్తి కాగానే మిత్రులలో దాదాపు సగానికి పైగా విడిపోతారు. ఇందులో కొందరు ఆర్థిక పరిస్థితులతో చదువు మానేసి కుటుంబ పోషణలో భాగమవుతుంటే మరికొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడుతుంటారు. ఇలా మూడు దశాబ్దాల కిందట పదో తరగతి పూర్తి చేసుకుని ఉద్యోగంలో స్థిరపడ్డ కొందరు ఆనాడు తమతో చదువుకున్న స్నేహితులలో ఎవరికి కష్టమొచ్చినా మేమున్నామంటూ భరోసానిస్తున్నారు. లోకేశ్వరం మండలం పంచగుడి, ధర్మోర గ్రామాలకు చెందిన కొందరు యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట గ్రూపు ఏర్పాటు చేసుకుని స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. 2014లో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికై తెలుగు రాష్ట్రాల్లో కొలువులో ఉన్న కొందరు పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఏర్పడి తమతో శిక్షణ పొందిన ఎస్సై కుటుంబాల్లో ఎవరికి ఆపదొచ్చినా వారికి ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. ప్రస్తుతం ఆత్మీయ సమ్మేళనాలతోనే సరిపెట్టుకుంటున్న పూర్వ విద్యార్థులు కూడా ఈ దిశగా ఆలోచిస్తే ఎన్నో కుటుంబాలను ఆదుకున్న వారవుతారు.

రక్తబంధం కాదు.. రక్షక బంధంతో...

2014 ఎస్సై బ్యాచ్‌లో 1100 మంది శిక్షణ పొందగా, 746 మంది సభ్యులు పోలీసు సోషల్ వెల్ఫేర్‌లో సభ్యత్వం తీసుకున్నారు. వీరిప్పుడు తమతో పాటు శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏ ఒక్క కుటుంబానికి ఆపదొచ్చినా పలకరిస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నారు. వీరు ఇప్పటి వరకు మరణించిన, క్షతగాత్రులైన వారి కుటుంబాలకు రూ.82.50 లక్షల ఆర్థిక సాయం అందజేసి తమది రక్తసంబంధం కాకపోయినా రక్షక బంధాన్ని చూపామంటున్నారు.

మూడు దశాబ్దాలు దాటినా...

బెల్లంపల్లి గురుకులం 1989-90 బ్యాచ్ పదో తరగతి మిత్రులు నేటికీ అప్పుడప్పుడు కలుసుకుంటూ కష్టసుఖాలు పంచుకుంటున్నారు. వీరితో పాటు పదో తరగతి పూర్తి చేసుకున్న లోకేశ్వరం మండలం పోట్‌పెల్లి(బి) వాసి సాయన్న 2022లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మిత్రులు సాయన్న తల్లిదండ్రుల దీనస్థితిని చూసి చలించిపోయారు. తలా కొంత పోగు చేసి రూ.53వేల ఆర్థిక సాయం అందజేశారు. మంచిర్యాలకు చెందిన మరో మిత్రుడు కమలాకర్ గుండెపోటుతో నాలుగు మాసాల కిందట మరణించారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న మిత్రులు తలా కొంత పోగు చేసి రూ.1.75 లక్షలను ఆ పిల్లలకు అందజేశారు.



పంచగుడిలో శ్రీకాంత్ తండ్రి గంగాధర్‌కు నగదు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

యువకులంతా ఒక్కటై..

పంచగుడి, ధర్మోర గ్రామాల యువకులు 50 మంది తమలో ఏ ఒక్కరికి కష్టమొచ్చినా దాన్ని కొంతవరకైనా పూడ్చాలని హెల్పింగ్ హ్యాండ్స్ అనే గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో ఒకరిగా ఉన్న పంచగుడి వాసి సలీం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి రూ.30 వేలు, వారం రోజుల కిందట అదే గ్రామవాసి శ్రీకాంత్ గుండెపోటుతో మరణించగా ఆయన తండ్రి గంగాధర్‌కు రూ.75 వేల ఆర్థిక సహాయం చేశారు.



ఉద్యోగులతో కలిసి నృత్యం చేస్తున్న ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ

సందడి చేసి.. ఉత్సాహపరిచి..

ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ స్టెప్పులు వేసి సహ ఉద్యోగులను ఉత్సాహపరిచారు. ఆదివారం ఆదిలాబాద్ గాయత్రి గార్డెన్‌లో తపాలా శాఖ ఆదిలాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఫెస్ట్-ఓ-పోస్ట్ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. తపాలా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నృత్యాలు చేసి అలరించారు. పాటలు ఆలపించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఉప పర్యవేక్షకుడు లవకుశ్, ఐపీవోలు ఎన్.రాజు, దిలీప్, కల్యాణ్, ఐపీపీబీ మేనేజర్ రాజేశ్, ఎఫ్ఎన్‌పీవో ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేశ్, ఆలిండియా జీడీఎస్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఆదిలాబాద్ డివిజన్ కార్యదర్శి గట్టు శ్రీనివాస్, తపాలా సిబ్బంది ఉన్నారు.



నృత్యం చేస్తున్న యువతి

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం

EENADU e Classifieds

FINANCIAL SERVICES

JOBS

FACULTY/ TEACHERS

Wanted Computer Faculty / Teachers, Minimum 2 years Experience Required Star Computers Asifabad. Ph: 9948724728.

DRIVERS

EVZIP Mobility, Wanted Drivers (50) at Gachibowli, Hyderabad. 12 Hours Duty. Free Food During Duty Hours. Good Salary. Call: 9390051628, 9390373549.

గమనిక

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99590 97631 90005 66042

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80083 42688

Book Your 5 Lines Classified Advertisement for B & W Rs. 300/- Only Colour Rs. 350/- Only GST 5% Applicable in Classifieds on any day For further details Contact: Adilabad: 99590 97631 90005 66042

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఇచ్చోడ:
? ఇచ్చోడ జాతీయ రహదారికి ఆనుకొని మార్కెట్ యార్డు పక్కన ఉన్న పంటపొలంలో 33 కేవీ విద్యుత్తు లైన్ ఒకవైపు వంగి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి.
- రత్నాకర్‌రెడ్డి, ఇచ్చోడ

✔ పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- జాదవ్ రాజు, విద్యుత్తు ఏఈ



కలెక్టర్ జన్మదిన వేడుకలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : జిల్లా పాలనాధికారి రాజర్షిషా ఆదివారం 34వ వసంతంలోకి అడుగుపెట్టారు. క్యాంపు కార్యాలయ సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాలనాధికారిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది నడుమ కేకు కోసి సాదాసీదాగా సంబరాలు చేసుకున్నారు. డీఎంహెచ్‌ఓ కృష్ణ, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాఠోడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

స్వాగతం తెలపని ద్వారం

పట్టణంలోకి ప్రవేశించే ప్రజలకు నలుమూలలా స్వాగతం తెలిపేలా ద్వారాలను బల్దియా యంత్రాంగం ఏర్పాటు చేసింది. పట్టణ సరిహద్దుల్లో బట్టిసావర్గాం, బంగారుగూడ, అంకోలి రహదారులపై ద్వారాలను ఏర్పాటు చేశారు. రాంపూర్ సమీపంలో రహదారికి ఒక వైపు స్తంభాన్ని నిలబెట్టి, రెండో వైపు వదిలేశారు. సమీపంలో విద్యుత్తు లైను ఉండటంతో దాన్ని మార్చిన తర్వాత స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. రెండేళ్లు గడిచినా దాని గురించి పట్టించుకోవడం లేదు.
- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్


రాంపూర్‌లో రోడ్డుకు అటు వైపు స్తంభాన్ని నిలబెట్టి, ఇటు వైపు వదిలేశారిలా

నేర వార్తలు

అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్టు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ పోలీసు స్టేషన్‌లో నమోదైన అట్రాసిటీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. 13న సైద్‌పూర్ నుంచి భీంసరికి వాహనాల్లో డీజే, జనరేటర్ తీసుకెళుతున్న చరణ్‌సింగ్, రాజు, అశోక్‌లపై దాడి చేసిన వారిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేయగా నిందితులంతా పరారయ్యారన్నారు. దాడి చేసిన రామాయి గ్రామానికి చెందిన జిట్ట ప్రభాకర్, జిట్ట రత్నాకర్, శ్యాంబాయి, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ఇస్తారి, దత్తుతో పాటు మరికొందరిపై అట్రాసిటీ కేసును నమోదు చేశామన్నారు. ఆదివారం ఎం.శ్యాంసుందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. మిగతా వారి ఆచూకీ తెలుసుకొని అరెస్టు చేయటానికి ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌కు చెందిన సబ్బని మురళికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాహనాన్ని శనివారం రాత్రి ఇంటి ముందు నిలిపి పడుకున్నాడు. ఆదివారం ఉదయం లేచి చూడగా కనిపించలేదు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జీఓ 29 రద్దు చేయాలి


ఎదులాపురం, న్యూస్‌టుడే : జీఓ 29 రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆందోళనలు చేస్తున్న అభ్యర్థులపై లాఠీ ఛార్జి చేయడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ అభ్యర్థుల పట్ల భాజపా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. లింబారావు, మల్లేశ్, రాములు, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్


రమేష్ రాఠోడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

మాజీ ఎంపీ రమేష్ రాఠోడ్ జయంతి

ఉట్నూరు, న్యూస్‌టుడే : మాజీ ఎంపీ రమేష్ రాఠోడ్ జయంతిని ఆదివారం ఉట్నూరులో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తనయుడు రితేష్ రాఠోడ్, కుటుంబ సభ్యులతోపాటు పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు ధన్‌లాల్, గంగన్న, రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.


పక్కనే పాఠశాల భవనం

జామ తోటను పెంచేశారు!

ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాల ఆరేళ్ల కిందట ప్రారంభం కాగా, అక్కడి ప్రధానోపాధ్యాయుడు ఉత్తమ్ ప్రత్యేక శ్రద్ధతో 100 వరకు జామ మొక్కలను నాటించారు. ప్రస్తుతం అవి పెరిగి తోటగా మారింది. పచ్చదనంతో పాటు విద్యార్థులకు జామ పళ్లను అందిస్తోంది. విద్యార్థులు శ్రద్ధతో మొక్కలను కాపాడుకోవడంతో నేడు పరిసరాలు పచ్చదనంగా మారాయి. మరోవైపు వంటశాల పక్కనే ఉండటంతో వృథా నీరంతా మొక్కలకు చేరుతోంది. **- న్యూస్‌టుడే, ఇచ్చోడ**

వ్యాసం రాసి... విజేతగా నిలిచి


పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలు సాయిప్రీతి, జునైర్‌ఖాన్, సయ్యద్ అమన్‌అలీలకు బహుమతులు ఇస్తున్న కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కర్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో 8వ తరగతి విద్యార్థులు డి.సాయిప్రీతి ప్రథమ, ఎం.డి.జునైర్‌ఖాన్ ద్వితీయ, పదో తరగతి విద్యార్థి సయ్యద్ అమన్ అలీ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలపై సన్నద్ధత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు నిర్వహణకు జిల్లా శాఖ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.రాజేశ్వర్ అన్నారు. డైట్ కళాశాలలో ఆదివారం పోటీల సన్నద్ధతపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలనాధికారి, ఎస్పీ అతిథులుగా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, టీఎన్జీవోల సంఘ అధ్యక్షుడు అశోక్, ఐఎంఏ అధ్యక్షుడు డా.అశోక్ తదితరులను ఆహ్వాన కమిటీలో సభ్యులుగా నియమించారు.

అదుపు తప్పితే ప్రమాదమే!



బోథ్ మండలం కుచులాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి ధన్నూర్ వెళ్లే మార్గంలో కుచులాపూర్ గ్రామ సమీపంలోని పోచమ్మ ఆలయం వద్ద మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఒకదాని తరువాత మరొక మూలమలుపు ఉండటంతో వాహనాలు ఎదురుగా వచ్చే వరకు కనిపించని పరిస్థితి. దీంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, బోథ్**

మున్నూరుకాపు జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్ పట్టణం: మున్నూరుకాపు సంఘం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా శాంతినగర్ కాలనీకి చెందిన సాయిని రవి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆధ్వర్యంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గాన్ని అక్కడే ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా విఠల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా జైపాల్, ఉపాధ్యక్షులుగా సురేష్, సమన్వయకర్తగా సంతోష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా దేశెట్టి ప్రభావతి నియమితులయ్యారు.


సాయిని రవిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య


రుయ్యాడిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తలమడుగు, న్యూస్‌టుడే : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నేత లోక ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోయా కొనుగోళ్ల పరిమితిని 6 నుంచి 10 క్వింటాళ్లకు పెంచిన నేపథ్యంలో ఆదివారం రుయ్యాడిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు సాంబశివ్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సురేష్‌రెడ్డి, గణపతిరెడ్డి, ఉడుగు రాకేష్, సుభాష్, గంగన్న, మహేశ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సక్కు, తదితరులు

కుమురం భీం ఆశయ సాధనకు కృషి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : కుమురం భీం పోరాట ఫలితంగానే ఆదివాసీలకు హక్కులు వచ్చాయని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్‌లో గ్రామస్థులు ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని భీం మనవడు సోనేరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి ఆవిష్కరించారు. మనోహర్, నగేష్, బాపురావు, పుష్పరాణి, ఇస్రు, దుర్గు, చిన్ను, తదితరులు పాల్గొన్నారు.

భారాస నాయకుల ఆందోళన


బేలలో సీఎం ఫ్లెక్సీని దహనం చేస్తున్న జోగు రామన్న


జైనథ్: ధర్నా చేస్తున్న భారాస నేతలు


గుడిహత్నూర్‌లో..


భీంపూర్‌లో ఆంజనేయుడి విగ్రహాన్ని శుద్ధి చేస్తూ..

జైనథ్, గుడిహత్నూర్, భీంపూర్, బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, బేల సిరికొండ, తలమడుగు, ఉట్నూరు, ఇంద్రవెల్లి, ఇచ్చోడ(నేరడిగొండ), నార్నూర్, **న్యూస్‌టుడే:** రైతు రుణమాఫీ, రైతు భరోసా డబ్బులను వెంటనే అన్నదాతల ఖాతాలో జమ చేయాలని భారాస నాయకులు మండల కేంద్రాల్లో ఆదివారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ సర్కారు రైతులను మోసం చేస్తోందన్నారు.


నార్నూర్‌లో.. ధర్నాలో పాల్గొన్న జడ్పీ మాజీ ఛైర్మన్ జనార్దన్ రాఠోడ్


బోథ్‌లో నాయబ్ తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేస్తూ..


బజార్‌హత్నూర్‌లో..


తలమడుగులో..


ఇచ్చోడలో నిరసనలో పాల్గొన్న భారాస నాయకులు


నేరడిగొండలో..


ఉట్నూరులో..



కప్పర్ల పాఠశాలలో పూర్వ విద్యార్థులు, నాటి గురువులు

సంతోషాన్ని పంచుకొని.. సరదాగా గడిపి

తాంసి, న్యూస్‌టుడే : కప్పర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1988-89 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా ఆదివారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. గురువులను సన్మానించారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. గురువులు నారాయణ రెడ్డి, భజరంగ్, దేవిదాసు, సుదర్శన్, సుధాకర్ తదితరులున్నారు.

బేల: సాంగిడి ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠాలు బోధించిన గురువు గడ్డం నాగరెడ్డిని సన్మానించారు.



సాంగిడిలో పూర్వ విద్యార్థులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగరెడ్డి

వేతన బకాయిలు చెల్లించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు ఏడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి స్పందించి వేతనాలు చెల్లించని గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏఎన్‌ఎంల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఐటీయూ ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల అధ్యక్షులు బొజ్జ ఆశన్న, రాజేందర్, ఏఎన్‌ఎం సంఘం అధ్యక్ష కార్యదర్శులు కమల, ఆర్.అనిత, శ్యాంసుందర్, నర్మద, కావేరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అన్నమొల్ల కిరణ్

ఉపాధ్యాయులకు సన్మానం

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : కష్టాలను ఎదురీది ఉపాధ్యాయులుగా ఎంపికైన జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నూతన ఉపాధ్యాయులను ఆదివారం ఆ గ్రామస్థులు సన్మానించారు. గ్రామానికి చెందిన దేవ్‌తాజే సుమిత్, దేవతాడే దీక్ష, బద్దం చైతన్య రెడ్డి, కట్కం ప్రీతిలు ఉపాధ్యాయుగా నియమితులు కావడంతో వారిని, కుటుంబ సభ్యులను సత్కరించి అభినందించారు.


నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లక్ష్మీపూర్ గ్రామస్థులు

కేటీఆర్ సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ నెల 24న ఆదిలాబాద్‌కు వస్తున్న మాజీ మంత్రి కేటీఆర్ సభకు అధిక సంఖ్యలో జనాన్ని తరలించి విజయవంతం చేయాలని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్‌లోని మహాలక్ష్మివాడ, ఇతర కాలనీల్లో ఆదివారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్లు అశోక్‌స్వామి, భూమన్న, నాయకులు సాజిదొద్దీన్, గణేష్, రామేశ్వర్, రవి, మహేందర్, సాయి, పర్వీన్, యమున, నంద తదితరులు పాల్గొన్నారు.

బేల, న్యూస్‌టుడే : కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధు రాదన్న కేసీఆర్ మాటలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని భారాస జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం బేలలోని గణేష్ గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంగ్రెస్ ప్రభుత్వంతో దోస్తీ చేస్తున్నారన్నారు. 24న ఆదిలాబాద్ రాంలీలా మైదానంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి కేటీఆర్ వస్తున్నారని, రైతులను పెద్ద సంఖ్యలో తరలించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నేతలు మనోహర్, గంబీర్ ఠాక్రే, ప్రమోద్‌రెడ్డి, దేవన్న, మధుకర్, సతీష్ పవార్, తేజారావు, విపిన్ ఖోడే, దత్తు తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్: ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి ఈ నెల 24న రాంలీల మైదానంలో మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని పురపాలక అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం రాంనగర్, సుభాష్‌నగర్, కేఆర్కే కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ బహిరంగ సభ ప్రచార కరపత్రాలను అందజేశారు. పార్టీ నాయకులు దమ్మపాల్, వసంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22న నార్నూర్‌లో భీం వర్ధంతి సభ

నార్నూర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కుమురంభీం భవనం వద్ద ఈ నెల 22న నిర్వహించే భీం వర్ధంతి కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలు, దళితులు, భీం అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు మడావి మాన్కు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మూల్‌వాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు తొడసం నాగోరావు, ప్రధాన కార్యదర్శి సలాం విజయ్‌కుమార్, సురేష్ ఆడే, గ్రామ పెద్ద మేస్రం రూప్‌దేవ్‌పటేల్, ఆదివాసీ, మూల్‌వాసి, ఆదిమ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బేలలో సోయా కొనుగోళ్లు

బేల: బేల ఉప మార్కెట్ యార్డులో సోమవారం నుంచి సోయా కొనుగోళ్లు ప్రారంభమవుతాయని బేల, డోప్టాల సహకార సంఘాల ఛైర్మన్లు బాల్‌చందర్, జితేందర్ తెలిపారు. గ్రామాలవారీగా కొనుగోళ్ల షెడ్యూల్‌ను ప్రకటించామన్నారు. కేటాయించిన తేదీల్లో రైతులు సోయా పంటను విక్రయానికి తీసుకురావాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బోథ్: బోథ్ భక్త మార్కండేయ ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్సయ్య, అధ్యక్షుడిగా చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారులుగా ప్రసాద్, నగేష్, ఉపాధ్యక్షులుగా పోశెట్టి, రవి, గంగయ్య, సంయుక్త కార్యదర్శులుగా గణేష్, ప్రసాద్, నరేందర్, సలహాదారులుగా చంద్రమోహన్, సత్యనారాయణ, రాజేశ్వర్‌లను ఎన్నుకున్నారు. ఇటీవల ఉద్యోగాలు సాధించిన కుల సంఘం సభ్యులను సన్మానించారు.

కార్యవర్గం ఎన్నిక

పాలనాప్రాంగణం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బి.రాహుల్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఇ.సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శిగా జి.విద్యారాణి, జిల్లా కోశాధికారిగా బి.ఆనందం ఎన్నికైనట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, జావిద్‌అలీ ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

పూర్వ విద్యార్థుల అన్నదానం

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీగోపాల కృష్ణ విద్యా మందిర్ పాఠశాలలో 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం రిమ్స్ సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రంలో రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. రంజీష్, హరీశ్, సునీల్, సంతోష్‌గౌడ్, ఓంప్రకాశ్, శ్యాం, దాస్, జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం

ఆదిలాబాద్ అర్బన్: మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం సంఘం కార్యాలయంలో సన్మానించారు. ఆదివారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి బబ్బిలి సుధాకర్, కోశాధికారి గంపల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఏర సుధీర్, సంయుక్త కార్యదర్శి ముల్కల రాజేశ్వర్‌లను శాలువాతో సన్మానించారు. సమావేశంలో మేకల మల్లన్న, బేర దేవన్న, సింగరి అశోక్, మెట్టు ప్రహ్లాద్, సూరం భగవాండ్లు, బాబన్న, స్వరూపరాణి, కిరణ్, దేవన్న, లచ్చన్న, నల్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భారాస నాయకులపై కేసు నమోదు

బేల, న్యూస్‌టుడే : బేలలో పోలీసుల అనుమతి లేకుండా జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేసిన భారాస నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాధిక తెలిపారు.

ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశం

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మండల కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని, బీడీ కార్మికుల మహాసభలను విజయవంతం చేయాలన్నారు. విలాస్, దేవేందర్, గోవర్ధన్, రాజు, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


పార్డి-కెలో గుస్సాడీ టోపీలను అల్లుతున్న యువకులు

ఆదివాసీ గూడేల్లో దండారి సందడి

సొనాల(బోథ్) : బోథ్ మండలంలోని ఆదివాసీ గూడేల్లో దండారి వేడుకలు ప్రారంభమయ్యాయి. యువకులు గుస్సాడీ టోపీలను అల్లుతున్నారు. రాత్రి పూట పాటలు పాడుతూ, వాయిద్యాలతో సందడి చేస్తున్నారు. నృత్యాలు చేస్తున్నారు.